www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 28 ఏప్రిల్ 2025
5
వైఎస్ఆర్




నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం సభాభవన్‌లో నిర్వహించనున్నట్లు డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించవచ్చునని తెలిపారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు నిర్వహిస్తామని ప్రజలు 08562-244437 నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చు అని తెలిపారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో..
జనం ఉక్కిరిబిక్కిరి



రోజుకు 2, 3 గంటలు విద్యుత్ కట్
పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

ఆధునిక యుగములో విద్యుత్ అత్యవసరంగా మారింది. ఏ పని చేయాలన్నా విద్యుత్ లేకపోతే ఆగాల్సిందే. అలాంటి అత్యవసరమైన విద్యుత్‌కు కోతలు అధికమై జనజీవనంపై తీవ్ర ప్రభావం పడుతుంది. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కొద్దిరోజులుగా అనధికార విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 నుంచి ఉష్ణోగ్రత తీవ్రత ఎక్కువైంది. ఉక్కపోతతో ఓ పక్క జనం అల్లాడుతుంటే వేళాపాలలేని విద్యుత్ కోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత ప్రభుత్వం నుంచి కూటమి సర్కారు వరకూ మోపుతున్న విద్యుత్ ఛార్జీల భారంతో వినియోగదారులు ఇప్పటికే సతమతమవుతున్నారు. ట్రూ అప్, సర్దుబాట్ల ఛార్జీల పేరుతో ప్రభుత్వం అదనపు వసూళ్లు చేస్తుంది. రూ.150 నుంచి రూ.300 పైనే అదనపు బిల్లులు వినియోగదారులపై పడుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్రకటిత కోతలతో వినియోగదారులను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. పలు ప్రాంతాల్లో రోజుకు రెండు నుంచి మూడు గంటలు కోత విధిస్తున్నారు. తరచూ అంతరాయాలు కలుగుతున్నాయి. చాలా కాలం నుంచి అధికారికంగా విద్యుత్ కోతలు లేవు. ఎక్కడో సాంకేతిక కారణాల వల్ల ఒకటి నుంచి రెండు గంటల అంతరాయం తప్పితే రోజూ నిర్ణీత సమయంలో కోతలు విధించిన దాఖలాలు లేవు. కొన్నిచోట్ల నిర్వహణ పేరుతో అప్రకటిత కోతలు ఉంటున్నాయి. అయితే వినియోగం బాగా పెరిగిపోవడంతో ప్రస్తుతం మళ్లీ విద్యుత్ కోతలు విధిస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం అల్లాడుతున్న తరుణంలో కోతల వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో బాధపడేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో కూడా ఒక్కొక్కసారి కోతలు విధించడంతో దోమల దండయాత్ర చేస్తున్నాయని జనం గగ్గోలు పెడు తున్నారు. అర్ధరాత్రి కోతలతో అంధకారం నెలకొంటుంది. విద్యుత్ ఆధారంగా నడిచే పలు చిన్న , మధ్య తరహా పరిశ్రమల యజమానులు ,జీవనం సాగిస్తున్న కూల్ డ్రింక్ షాప్, పంచరన్ల బంక్, కుట్టు మిషన్, కార్పెంటర్ తదితర వారు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సమయానికి రాక పల్లెలు, పట్టణాల్లో త్రాగునీటి కోసం జనానికి అవస్థలు తప్పడం లేదు. ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో డిమాండ్ సైతం పెరుగుతోంది. దీంతో కోతలు అనివార్యంగా కనిపిస్తున్నాయి. ప్రతి రోజూ విద్యుత్ కోటా మారుతూ వస్తుంది. పెరుగుతున్న డిమాండ్ ఆధారంగా కోటా పెరగాల్సి ఉంటుంది. ఇప్పుడే ఇలా అంటే మే నెలలో ఎలాంటి పరిస్థితి ఉంటుందోదన్న భయం ప్రజల్లో కలిపిస్తుంది. మరోవైపు ఎసిల వినియోగం బాగా పెరిగింది. దీంతో డిమాండ్‌కు తగ్గట్టుగా సప్లయి లేదు.

ఆయా రంగాల కార్మికులపై ప్రభావం

భవన నిర్మాణ పనుల కోసం యంత్రాల సహాయంతో చెక్కలను కోత కోయడం జరుగుతుంది. అలాగే ఎలక్ట్రికల్, పంబ్లింగ్ పనిచేసేవారు, తాపీ మెస్త్రీలకు విద్యుత్ ఆటంకాల వలన పనులు ముందుకు సాగడం లేదు. కొన్ని రోజులుగా అనేక ప్రాంతాల్లో విధిస్తున్న కోతల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వివిధ రకాల కార్మికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. వెల్డింగ్ వర్కర్లు విద్యుత్ కోతల వల్ల అవస్థలు పడుతున్నారు. ఇలా విద్యుత్ ఆధారంగా పనిచేస్తున్న కార్మికులు ఉపాధికి గండి పడుతోంది.

రోజుకో సాకుతో సరఫరా నిలిపివేత

సబ్‌స్టేషన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, స్తంభాల ఏర్పాటు, లూజ్ వైర్ల మరమ్మతులు అంటూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. విద్యుత్ బిల్లులు మాత్రం ఎప్పుడు వచ్చే వాటికన్నా ఎక్కవ రావడంతో వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. గట్టిగా గాలి వీచినా, ఇతర ఏవైనా రిపేర్లు వచ్చినా కోతలు అదనంగా ఉంటాయి. రూరల్ పరిధిలో మరమ్మతుల పేరుతో వివిధ ప్రాంతాల్లో రిపేర్లు చేస్తున్నట్లు ప్రకటించి, నిత్యం గంటల పాటు కరెంట్ కోత విధించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న ఫీడర్ అయినా, పెద్ద ఫీడర్ అయినా గంటల పాటు అన్ని సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు.

అంతరాయంతో ఆదాయం తగ్గుతుంది

కొత్తగా నిర్మించిన ఇళ్లకు వుడ్ వర్క్ పనులకు కరెంటు కోతల వల్ల అంతరాయం ఏర్పడి ఆదాయం తగ్గుతుంది. పనులు జరిగినా, జరగకపోయినా కార్పెంటర్ కూలి మాత్రం ఇవ్వాల్సిందే. కరెంటు లేకపోతే పనులు జరిగే పరిస్థితి లేదు. గ్రామీణ ప్రాంతాలలో మరీ ఎక్కువగా కోతులు ఉన్నాయి. దీనివల్ల ఆదాయం తగ్గుతుంది.

- రాజా, కార్పెంటర్, పులివెందుల

కస్టమర్లకు సరైన సమయానికి ఇవ్వలేకపోతున్నాం

కుట్టు మిషన్‌తో జీవనం సాధిస్తున్నాం. విద్యుత్ కోతల వల్ల కస్టమర్లు ఇచ్చిన బ్లౌజులు, డ్రస్సులు సరైన సమయానికి ఇవ్వలేక కస్టమర్ సంఖ్య తగ్గుతుంది. గ్రామీణ ప్రాంతాలలో మరీ ఎక్కువగా కోతలు ఉన్నాయి. కోతల వల్ల పనులు జరగక జీవనం సాగించడం కష్టంగా ఉంది.

- సునంద, టైలర్ లింగాల మండలం

ఉక్కపోతకు తట్టుకోలేకపోతున్నాం

ఎండల తీవ్రత పెరగడంతో ఉష్ణోగ్రతలు తీవ్రత కూడా పెరిగింది.విద్యుత్ లేకపోతే ఉక్కపోతకు తట్టుకోలేని పరిస్థితి. మధ్యాహ్నం సమయంలో కోతలు ఎక్కువగా ఉండటం వల్ల ఇంట్లో ఉండలేకపోతున్నాం.

- దస్తగిరి, వృద్ధుడు పులివెందుల



సిపిఎం రాష్ట్ర కార్యదర్శిని అగౌరవంగా మాట్లాడిన
డిప్యూటీ స్పీకర్‌ను బర్తరఫ్ చేయాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్

ప్రజాశక్తి-కడప అర్బన్

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావును అగౌరవంగా మాట్లాడిన డిప్యూటీ స్పీకర్‌ను బర్తరఫ్ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రామకృష్ణ నగర్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఎస్.గౌసియా బేగం అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉండి నియోజకవర్గం అల్లూరి సీతా రామరాజునగర్ ప్రాంతంలో పేదల ఇళ్లను కూల్చివేసి రోడ్లపాలు చేసిన వారికి మద్దతు ఇచ్చిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై అగౌరవంగా మాట్లాడిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు పదవికి అనర్హుడని, ఆయనను రాష్ట్ర ప్రభుత్వం బర్తరఫ్ చేయాలని కోరారు. రాజ్యాంగ బద్ద పదవిలో ఉంటూ, అన్ పార్లమెంట్ లాంగ్వేజ్ ఉపయోగించిన డిప్యూటీ స్పీకర్‌ను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వానికి బుద్ధి వచ్చేవరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థిక సంక్షోభం పెరిగిందని చెప్పారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ అనేక దేశాలపై మోయలేని సుఖాలను మోపి 'వాణిజ యుద్ధం' ప్రారంభించారని తెలిపారు. ప్రపంచ టెర్రరిస్ట్ దేశంగా పిలవబడుతున్న ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజలను ఊచకోత కోస్తుందని గుర్తు చేశారు. మరోవైపు శ్రీలంక ఎన్నికల్లో వామపక్ష కూటమి ప్రత్యామ్నాయ విధానాలతో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. దేశంలో నరేంద్ర మోడీ మైనార్టీ ప్రభుత్వం నితీష్ కుమార్, చంద్రబాబు నాయుడు మద్దతుతో నడుస్తోందని చెప్పారు. బిజెపి దేశంలో 10 సంవత్సరాలుగా పరిపాలనలో హిందుత్వ మత ఉన్మాదాన్ని ప్రేరేపిస్తోందని, కుల వివక్షత ప్రేరణలు చేస్తోందని, ముస్లింల పైన, దళితుల పైన దాడులు పెరిగాయని తెలిపారు. జమ్మూ కాశ్మీర్లో ఉగ్రవాదులు చేసిన దాడిలో 26 మంది చనిపోయారని, ఉగ్రవాదులను అడ్డుకున్న ముస్లిం యువకుల్ని ఉగ్రవాదులు కాల్చి చంపారని నిజాలు, వాస్తవాలు ఇలా ఉండగా, దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వ ప్రచారం, బిజెపి సంఘపరివార శక్తులు ముస్లింలపై తప్పుడు ప్రకారం చేస్తున్నాయని, దీన్ని ముస్లిం ఇతర సమాజం వ్యతిరేకించాలన్నారు. ఈ మారణ హోమానికి కేంద్ర ప్రభుత్వం భద్రత వైఫల్యం కారణమన్నారు. మోడీ, అమిత్ షాలే దీనికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టిడిపి చంద్రబాబు నాయుడు తనది ఎన్‌డిఎప్రభుత్వం అని తరచూ చెబుతున్నారని కానీ కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తీసుకుని వచ్చిన సందర్భాలు లేవని వాపోయారు. సిపిఎం కార్యకర్తలు నిరంతరం ప్రజలతో ఉండాలని, ప్రజలను చైతన్యం చేయాలని, ప్రజా ఉద్యమాలు నడపాలని పిలుపునిచ్చారు.సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, ఎ.రామ్మోహన్, వి.అన్వేష్, కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులు రెడ్డి, దస్తగిరి రెడ్డి, సత్యనారాయణ, శీను, చాంద్ బాషా, లక్ష్మి, రాజా, మండల, పట్టణ, నగర కమిటీల కార్యదర్శులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి

డిప్యూటీ స్పీకర్ పదవిని తప్పించాలి : సిఐటియు

ఉండి నియోజకవర్గం అల్లూరి సీతారామరాజు నగర్ ప్రాంతంలో పేదల ఇళ్లను కూల్చివేసి రోడ్లపాలు చేసిన వారికి మద్దతు ఇచ్చిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రావుపై అగౌరవంగా మాట్లాడిన డిప్యూటీ స్పీకర్ పదవికి అనర్హుడని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, శ్రీనివాసులు రెడ్డి, మనోహర్, కోశాధికారి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా పేదలకు మంచి చేయాల్సినటువంటి ప్రజాప్రతినిధి కూల్చేయమని చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఉన్నవాటిని అభివృద్ధి చేయాల్సింది పోయి తొలగించడం దారుణమని తెలిపారు. పేదల పక్షాన సిపిఎం నిరంతరం పని చేస్తుందని పేర్కొన్నారు. వారికి జరిగిన అన్యాయాలపై అడిగితే దుర్భసలాడడం సరైనది కాదని తెలిపారు. ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ పేదలకు మంచి చేయకపోగా, రోడ్డు పాలు చేయడం సరికాదని పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ద పదవిలో ఉంటూ, అన్ పార్లమెంట్ లాంగ్వేజ్ ఉపయోగించి అగౌరవంగా మాట్లాడిన డిప్యూటీ స్పీకర్ పదవికి అనర్హుడని తెలిపారు. కనుక డిప్యూటీ స్పీకర్ పదవి నుంచి తప్పించాలని పేర్కొన్నారు. లేకపోతే ఆందోళన చేస్తామని తెలిపారు.

జమ్మలమడుగు రూరల్ : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరణాల శివ నారాయణ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిరుపేదల ఇళ్లను కూల్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని ఎమ్మెల్యే రఘురామ కృష్ణం రాజు అనుకోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. నిరుపేదలు కేవలం రెండు సెంట్లు స్థలాన్ని ఆక్రమించి ఇళ్లను నిర్మించుకుంటుంటే అదేదో మహా పాపం అన్నట్లు వాటిని కూలదోస్తున్నాడని, కానీ బడాబాబులు ఎకరాలలో స్థలాలను ఆక్రమించుకున్నా పట్టించుకోవట్లేదని తెలిపారు. రఘురామ కృష్ణంరాజు దుర్మార్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి నిరుపేదలకు న్యాయం చేసేందుకు వెళ్లిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుపై రఘురామ కృష్ణం రాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం అతని మూర్ఖత్వానికి నిదర్శనమని, వెంటనే శ్రీనివాసరావుకు రఘురామ కృష్ణంరాజు క్షమాపణలు చెప్పి ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి కడప అర్బన్

రక్తదానం చేస్తే పలువురికి ప్రాణదానం చేసిన వారవుతారని ఖూన్‌కారిస్టా ఛారిటబులు ట్రస్ట్ చైర్మన్ తారిఖ్‌అలీ పేర్కొన్నారు. ఎంఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహబూబ్‌బీ అనే మహిళకు అత్యవసర చికిత్స నిమిత్తం బి పాజిటివ్ రక్తం అవసరం అని ఆమె కుటుంబ సభ్యులు డోనర్ కోసం వెతుకుతూ ఖూన్ కా రిస్టా చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ తారిక్ అలీని సంప్రదించారు. వెంటనే స్పందించి బృహదా బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా కరోనా కాలం,ఎండ కాలం,వేసవి కాలం, సంవత్సరంలో ప్రతి నిమిషం రక్తదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు తను స్వతహాగా 49 సార్లు రక్తదానం చేశానని చెప్పారు. అత్యవసర సమయంలో రక్తదానం చేసిన తారిక్ అలీకి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది,పేషంట్ బంధువులు,స్నేహితులు అభినందించారు. కార్యక్రమం లో పీపుల్ రెస్పాన్సిబుల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ప్రదీప్, షబ్బీర, బృహదా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, రాము, బెనర్జీ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న తారిక్ అలీ

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వేసవి సెలవులలో ఈనెల 28 నుంచి జూన్ 6 వరకు సమ్మర్ క్యాంపు కొండయపల్లె జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ లైబ్రేరియన్ పవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలు ఎండలో తిరగకుండా, ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు, క్రమశిక్షణను అలవార్చుకోనేందుకు సమ్మర్ క్యాంప్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు బుక్ రీడింగ్, స్టోరిలిజనింగ్, స్టోరీ టెల్లింగ్, బుక్ రివ్యూ, స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథమ్యాటిక్స్, (మ్యాథ్స్) మొదలగు అంశాలలో ఉపాధ్యాయుల చేత ఉచితముగా బోధించబడుతుందని తెలిపారు. అట విడుపుగా క్యారమ్స్, జిరాఫీ చెస్ ఆడిస్తామని పేర్కొన్నారు. పిల్లలకు జ్ఞాన వికాసం కలుగుతుందని తెలిపారు. జ్ఞాపక శక్తి (మెమొరీ) పెరుగుతుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పిఎ వాహిద్ విధుల నుంచి తొలగింపు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి, వ్యక్తిగత సహాయకులు వాహిద్ ఉద్యోగాల పేరుతో మహిళను మోసం చేసి పెళ్లి చేసుకోవడంతోపాటు మరో ముగ్గురు అమ్మాయిలను ట్రాప్ చేశాడన్న బాధితుల నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో అతన్ని తక్షణం ఉద్యోగం నుంచి తొలగించినట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరినట్లు పేర్కొన్నారు. బాధితులకు చట్ట ప్రకారం న్యాయం తప్పకుండా జరుగుతుందని తెలిపారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - బద్వేలు : ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకరరావు పేర్కొన్నారు. ఆదివారం బద్వేల్ నియోజకవర్గంలో పోరుమామిళ్ల, బద్వేలు వేదికలుగా సమావేశాలు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమోషనల్ ఛానల్, వివిధ ఇంజనీరింగ్ విభాగాలలో విలీనం, క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ఎదుర్కొన్నటువంటి వివిధ సమస్యల గురించి చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ మురళీధర్ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ దామోదర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు సుబ్బారెడ్డి, ఖలీల్‌బాషా పాల్గొన్నారు.

చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద అధికారులు చాలువ పందిళ్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపశమానం కల్పించాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ కోరారు. ఆదివారం డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ఉపశమానం ఉంటుందన్నారు. చలువ పందిళ్ళు లేకపోవడంతో ప్రజలు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు సమస్యను గుర్తించి ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద చలువ పందిళ్ళు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీకాంత్, ఉదయ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ముస్లిం, క్రిస్టియన్, బుద్ధిస్ట్, సిఖ్, జైన్, పార్సీ మైనారిటీ యువతకు ఆర్థిక సాయం అందించేందుకు సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షేక్. హిదయతుల్లా ఒక ప్రకటనలో పేర్కొన్నారు .మైనారిటీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని డి బ్లాక్‌లో ఉన్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

శాంతిని నెలకొల్పాలి

ప్రజాశక్తి - కడప : ఉగ్రదాడులు ఆపి శాంతిని నెలకొల్పాలని నగరంలోని 48 డివిజన్ న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ పేర్కొన్నారు. ఆదివారం చర్చిలో విశ్వాసులతో కలిసి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జమ్మూ కశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద మరణ కాండను ఖండించారు. ఉగ్రవాద దాడిలో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. గాయాలపాలైన వారికి కేంద్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం అందంచాలని కోరారు.

వాహిద్‌పై చర్యలు తీసుకోండి : వైసిపి

ప్రజాశక్తి - కడప : ఎమ్మెల్యే అసెంబ్లీలో మహిళలకు న్యాయం చేస్తామని ప్రసంగాలు ఇవ్వడం కాదని, మీ పిఎ వాహిద్ మహిళకు చేసిన అన్యాయంపై చర్యలు తీసుకోవాలని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి త్యాగరాజు, ఐటి వింగ్ నగర అధ్యక్షులు నందలూరు ఫయాజ్, ఎస్‌సి సెల్ నగర అధ్యక్షులు బాబు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కడప ఎమ్మెల్యే మాధవి పిఎ వాహిద్ తీరును ఈ సందర్భంగా వారు ఎండగట్టారు. కడపలో ఏ స్టేషన్‌కు వెళ్లినా వాహిద్ ఆగడాలు మితిమీరాయి అన్నారు. వైసిపి నాయకులపై అక్రమ కేసులు పెట్టడం కాదని , మీ పీఏ చేస్తున్న అక్రమాలపై కేసు పెట్టించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

స్మార్ట్‌మీటర్ల ద్వారా బిల్లుల చెల్లింపులకు కసరత్తు

- 30 రోజుల్లో పూర్తిస్థాయిలో వ్యవసాయ కనెక్షన్లు
- రూ.8.5 కోట్లతో క్రమబద్ధీకరణ చర్యలు
- ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వచ్చేఏడాది నుంచి స్మార్ట్‌మీటర్ల ద్వారా బిల్లుల చెల్లింపులకు కసరత్తు చేపట్టాం. ఈమేరకు జిల్లాలోని వాణిజ్య, ప్రభుత్వ కార్యాల యాలు, 500 యూనిట్లు దాటిన ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించడమైంది. నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంపై దృష్టి సారించాం. ఇందుకుగానూ జెఎల్‌ఎంల నుంచి గ్రేడ్-2 అధికారుల వరకు వారానికి రెండు దఫాలుగా రివ్యూ చేయడంతో అంతరాయానికి ముకుతాడు వేయగలుగుతున్నాం. ఎస్‌సి, ఎస్‌టిలకు రెండు కిలోవాట్ల సూర్యఘర్ స్కీమ్ ద్వారా అర్బన్ ప్రాంతాల్లోని ఇళ్లకు విద్యుత్ సదుపాయం అందుబాటులో తీసుకొచ్చే ప్రయ త్నం ఊపందుకుంది. దీంతోపాటు సంస్థకు ఆదాయాన్ని సమకూర్చడంలో భాగంగా డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహిం చామని, ఫలి తంగా బకాయిల భారాన్ని తగ్గించ డానికి పాటు పడుతున్నాం. విద్యుత్ చౌర్యం నిరోధించడంలో భాగంగా స్క్వాడ్స్ తనిఖీల నేపథ్యంలో 807 కేసుల నమోదుతోపాటు రూ.45 లక్షలు వసూలు చేయగలిగామని పేర్కొంటున్న ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణతో ముఖాముఖి...



ముఖా ముఖి..

జిల్లాలో విద్యుత్ వినియోగం గురించి తెలపండి?

ప్రస్తుతం రోజుకు 16.524 లక్షల మిలియన్ యూనిట్ల సాధారణ వినియోగం ఉంటుంది. గతేడాది 15 లక్షల యూనిట్లు వరకు వినియోగమైంది. ఈలెక్కన గతేడాది ఏప్రిల్ 24 తేదీ వినియోగంతో పోలిస్తే 1.5 మిలియన్ యూనిట్లు ఎక్కువగా వినియోగం జరిగినట్లు తెలుస్తోంది.

జిల్లాలోని విద్యుత్ సర్వీసులు ఎన్ని?

జిల్లాలో 8,97,853 విద్యుత్ కనెక్షన్లు న్నాయి. ఇందులో 6,76,940 గృహ కనెక్షన్లు, 1,19,000 వ్యవసాయ కనెక్షన్లు, 585 హెచ్‌టి కనెక్షన్లు, 5,330 ఇండస్ట్రియల్ కనెక్షన్లు, 12,332 కుటీర పరిశ్రమల కనెక్షన్లు ఉన్నాయి.

ట్రాన్స్‌ఫార్మర్లు లభ్యత ఎలా ఉంది?

జిల్లాలో 2,404 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడమైంది. మరో 132 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తే వ్యవసాయ కనెక్షన్లు పూర్తి స్థాయిలో అందించనట్లు అవుతుంది. దీంతోపాటు 1000 కిలోమీటర్ల కండెక్టర్ కొరత ఉంది. ఇప్పటివరకు 2000 కిలోమీటర్ల మేర కండెక్టర్‌ను ఇవ్వడమైంది. మరో నెల రోజుల వ్యవధిలో పూర్తి స్థాయి లో కండెక్టర్ ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాం.

ఆర్‌డిఎస్‌ఎస్ స్కీము పురోగతి ఎలా ఉంది?

ఆర్‌డిఎస్‌ఎస్ స్కీము లేబర్ కొరత వేధిస్తోంది. దేశంలోని యుపి, బీహార్ రాష్ట్రాలకు చెందిన లేబర్ అందుబాటులోకి రావడమే ఆలస్యం. అనంతరం ఆర్‌డిఎస్‌ఎస్ స్కీమ్ పరుగులు తీస్తుంది. జిల్లా లోని 392 ఫీడర్స్‌కు 102 ఫీడర్స్ పూర్తి చేయడమైంది. మరో 129 ఫీడర్స్ పురోగతిలో ఉన్నాయి.

సూర్యఘర్ స్కీమ్ అమలును వివరించండి?

సూర్యఘర్ స్కీమ్ కింద ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా అమలు చేస్తున్నాం. సుమారు రెండు కిలోవాట్ల మేరకు ఉచితంగా వర్తింపజేస్తాం. ఇప్పటికి 67,374 దరఖాస్తులు స్వీకరించడమైంది. ఇందులో 6,3475 దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేయడమైంది. ఇందులో 475 సూర్యఘర్ ఫలకలను అమర్చడమైంది.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు గురించి తెలపండి?

జ: 2026 ఏప్రిల్ స్మార్ట్‌మీటర్ల ద్వారా బిల్లులు వసూలు చేయడం జరుగుతుంది. జిల్లాలో ఇప్పటికి వాణిజ్య, ప్రభుత్వ కార్యాలయా లు, 500 యూనిట్లు వినియోగం కలిగిని గృహాలకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయడమైంది.

కేజీపీజీ సెట్-2కె25కు విశేష స్పందన

ప్రజాశక్తి- కడప అర్బన్

కందుల గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ వారి ఆర్యంలో డిగ్రీ ఉత్తీర్ణులై పోస్ట్ గ్రాడ్యుయేట్ చేయాలనే అశావహులకు కేజీపీజీసెట్-2కె25 నిర్వహించారు. ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల విద్యార్థిని, విద్యార్థులు హాజరు అయ్యారని కెఎస్‌ఆర్ఎం ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమణి తెలిపారు. ఐసెట్ తరహాలో ఉన్నత ప్రమాణాలతో నిర్వహించినట్లు చెప్పారు. ఈ పరీక్షలో టాప్ ర్యాంక్ సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత అడ్మిషన్ కల్పిస్తామన్నారు. ఈ పరీక్ష రాయడం పట్ల విద్యార్థులకు రాబోయే ఐ సెట్-2025 పరీక్ష పట్ల మంచి అవగాహనతో పాటు, అనుభవం కలుగుతుందని కేజీపిజీ సెట్2కె25 నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేజిపిజీసెట్ 2కె25 నిర్వహించడం పట్ల కళాశాల యాజమాన్యానికి విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది మార్గదర్శకాలను, సలహాలను తీసుకుని ఉన్నత రంగాలలో స్థిరపడాలని పిలుపునిచ్చారు. క్రమ శిక్షణ, కృషి పట్టుదలతో ఉంటే ఏదైన సాధించవచ్చునని పేర్కొన్నారు. పటిష్ట ప్రణాళికతో లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అండ్ ట్రెజరీ కందుల రాజేశ్వరీ, కెఎల్‌ఎం ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రత్నమ్మ, కెఎస్‌ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎన్.ప్రసాద్, సీనియర్ ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ ఆఫీసర్ ఆర్. నాగరాజు, కార్యనిర్వాహక సిబ్బంది, అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కేజీ సెట్ ప్రశ్నాపత్రం ఆవిష్కరిస్తున్న డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి



ఆలయ విశిష్టతను వివరిస్తున్న అర్చకుడు

అమ్మవారిని దర్శించుకున్న మెజిస్ట్రేట్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని అంకాలమ్మ గూడూరులో ఉన్న శ్రీ అంకాలమ్మ అమ్మవారిని పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం అంకాలమ్మ అమ్మవారు తిరుణాల చివరి రోజు మెజిస్ట్రేట్ కుటుంబ సమేతంగా దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సోమ కొండారెడ్డి, ఆలయ అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను వివరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. తిరుణాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ అమ్మవారు..

శ్రీఅంకాలమ్మ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుణాల చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు

నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు

- కొరవడిన అధికారుల నిఘా

ప్రజాశక్తి - వేంపల్లె



మద్యం అతిగా సేవించి పడిపోయిన వ్యక్తి

మండల కేంద్రమైన వేంపల్లెలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపులు నడుస్తున్నాయి. మద్యం విక్రయాలపై అధికారుల నిఘా కొరవ డ్డాయని విమర్శలు వస్తున్నాయి. మద్యం షాపుల యాజమానులు తమకు నచ్చినట్లుగా అమ్మకాలు సాగిస్తున్నారు. వేంపల్లెలో ఒక బారుతోపాటు 4 మద్యం షాపులున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం షాపులు తెరిచి ఉంచాలి. వేంపల్లెలో ఇందుకు విరుద్ధంగా ఉదయం 7 గంటలకే మద్యం షాపులు తెరుస్తున్నారు. మద్యం ప్రియులు షాపుల వద్ద క్యూ కడుతున్నారు. వాస్తవానికి వినియోగదారుడు దుకాణం వద్ద బాటిల్ కొనుగోలు చేసి తీసుకొని వెళ్లాల్సి ఉంది. సిట్టంగ్‌కు అనుమతి లేకపోయిన కొన్ని దుకాణాల్లో మాత్రం మందు బాబులకు సిట్టంగ్‌కు అనుమతి ఇస్తున్నట్లు సమాచారం. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మద్యం ఏ సమయంలోనైనా దొరుకు తుండడం వల్ల ఆయా ప్రాంతాల్లో మందు బాబులు చిందులు వేస్తున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఇకనైనా ప్రభుత్వం నిబంధనలను అమలు చేసేలా అధి కారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వస్త్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్ అభిషేక్ రెడ్డి సతీమణి, సోదరుడు

ఘనంగా వైఎస్ అభిషేక్‌రెడ్డి జయంతి

ప్రజాశక్తి - వేముల

వేల్పుల గ్రామపంచాయతీలో వైసిపి యువ నాయకులు వైఎస్ అభిషేక్‌రెడ్డి జయంతిని సందర్భంగా వైసిపి మండల పరిశీలకుడు వేల్పుల రామలింగారెడ్డి, ఉషారాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అభిషేక్‌రెడ్డి చిత్రపటానికి ఆయన సతీమణి సౌఖ్య, ఆయన కుమార్తెలు అక్షర, ఆకర్ష సోదరుడు అభినవ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామంలోని పేదలకు, విభిన్నప్రతిబావంతులకు దుస్తులు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోటురూ చిన్నప్ప, హేమాద్రిరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అభిషేక్‌రెడ్డి సతీమణి సౌఖ్యరెడ్డి

సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ..

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

దివంగత వైసిపి నేత వైఎస్ అభిషేక్‌రెడ్డి 37వ జయంతిని పురస్కరించుకుని ఆర్.తుమ్మలపల్లి గజ్జల అనూష మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన సతీమణి డాక్టర్ సౌఖ్యరెడ్డి, వారి పిల్లలు ఆకర్ష, అక్షర, అభిషేక్ సోదరుడు వైఎస్ అభినయ్‌రెడ్డి తదితరులు అభిషేక్‌రెడ్డి చిత్రపటానికి పుష్ప నీరాజనాలర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం గ్రామంలో ఉన్న 200 మందికి దుప్పట్లను అభిషేక్ కుటుంబ సభ్యులచే పంపిణీ చేయించారు. కేకు కట్ చేసి మంచి పెట్టారు. పులివెందుల పట్టణంలో పలుచోట్ల వైఎస్ అభిషేక్‌రెడ్డి జయంతి వేడుకలను వైసిపి నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, హేమంత్‌రెడ్డి ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం చేశారు. లింగాల మండలం వైసిపి మాజీ ఇన్‌ఛార్జి డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి జయంతి వేడుకలను ఈ ఆశ్రమంలో నిర్వహించారు. దుప్పట్లు పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన వైఎస్ అభిషేక్‌రెడ్డిని స్మరించుకుంటూ ఆయన జ్ఞాపకార్థం వైసిపి అభిమానులు, కార్యకర్తలు వృద్ధులకు అన్నదానం చేసినట్లు పార్టీమండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు హేమాద్రిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి

జివి సత్రంలో పారిశుధ్యం.. అధ్వానం



ఇందిరా నగర్‌లో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండల పరిధిలోని జివి సత్రంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఏ కాలనీలో చూసినా మురుగునీరు ప్రవహిస్తూ రోడ్లన్నీ కంపుతో దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా ఇందిరా నగర్‌లో మురుగు కాలువలు లేకపోవడంతో వ్యర్థ పదార్థాలు రోడ్ల పక్కన అధికంగా ఉన్నాయి. గృహ అవసరాలకు వినియోగించిన నీరు గుంతలలో నిలువ ఉంటూ దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఖాళీ ప్రదేశాల్లో వ్యర్థాలు అధికంగా వేస్తున్నారు. జివి సత్రం సమీపంలోని నంద్యాలంపేట ఎన్నో ఏళ్లుగా డంపింగ్ యార్డ్ నిర్వహణలో ఆదర్శంగా నిలుస్తున్నది. మోడల్ గ్రామంగా నంద్యాలంపేటను ఏర్పాటు చేసి చెత్త సేకరణను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ఇతర మండలాల నుండి నంద్యాలంపేటకు డంపింగ్ యార్డ్‌ను పరిశీలించేందుకు సిబ్బందిని తీసుకొస్తుంటారు. అలాంటి ఈ గ్రామ సమీపంలోని జివి సత్రంలో మాత్రం అందుకు పరిస్థితి భిన్నంగా ఉంది. చెత్త సేకరణలో, కాలనీలలో పారిశుధ్య నిర్వహణలో చాలా వెనుకబడి ఉంది. ప్రభుత్వం పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకొని నెలలో మూడవ శనివారం ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. పంచాయతీ అధికారులు ప్రతిరోజు గ్రామాల్లో పర్యటించి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని చర్యలు తీసుకుంటోంది. అయితే ఇది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఖాళీ ప్రదేశంలో పేరుకుపోయి ఉన్న వ్యర్థాలు

ఏనుగుల దాడిని అరికట్టాలి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె



ఎస్.తులసిరెడ్డి

రాష్ట్రంలో ఏనుగుల భీభత్సం ఎక్కువైందని, వీటి బారినుండి ప్రజలను, పంట పొలాలను కాపాడాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడవుల్లో ఆహారం, నీటి కొరతతోపాటు వివిధ ఏనుగు గుంపుల మధ్య పోరాటం కారణంగా అవి అడవుల నుండి సమీప గ్రామాల్లోకి వస్తున్నాయన్నారు. పంటలు ధ్వంసం చేయడం, కనిపించిన వారిని తొండంతో విసిరి వేస్తున్నాయన్నారు. ఈ ఏడాది జనవరి 18న తిరు పతి జిల్లా చంద్రగిరి మండలం, కందులవారిపల్లె ఉప సర్పంచ్ రమేష్ చౌదరిని ఏనుగులు తొక్కి చంపాయన్నారు. మార్చి 25న తిరుపతి జిల్లాలోని చిత్తేచర్ల పంచాయితీకి చెందిన సిద్దయ్య అనే రైతు మిరప పంటకు నీరు కట్టి వస్తుండగా ఆయనను కూడా ఏనుగులు తొక్కి చంపాయన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు, పుంగనూరు, చంద్రగిరి నియోజకవర్గాలలో, విజయనగరం జిల్లాలో, రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో ఏనుగుల దాడులు తరచుగా జరుగు తు న్నట్లు చెప్పారు. సిఎం సొంత జిల్లాలో, సొంత నియోజకవర్గం కుప్పంలో ఏనుగుల బెడద నుండి ప్రజలను, పొలాలను కాపాడాలని తులసిరెడ్డి కోరారు.

అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి కోరారు. రాష్ట్రంలో 1,44,987 ఎకరాలలో రైతులు అరటి పంట వేశారని చెప్పారు. కడప, అనంతపురం, నంద్యాల, తూర్పు గోదావరి, కోనసీమ, పార్వతీపురంతోపాటు ఆయా జిల్లాలలో అరటి పంటను రైతులు సాగు చేసినట్లు చెప్పారు. అరటి సాగుకు ఎకరాకు దాదాపు రూ.2 లక్షలు పెట్టుబడి అవుతుందన్నారు. ఎకరాకు 20 టన్నులు దిగుబడి వస్తుందని ఆశతో రైతులు పంటను సాగు చేశారని తెలిపారు. అరటి టన్నుకు రూ.10 వేలు ధర పలికితే పెట్టుబడి వస్తుందని చెప్పారు. సింగపూర్, మలేషియా, ఇండోనేషియా తదితర దేశాలకు ఎగుమతి నిలిచిపోయిన కారణంగా ధర అమాంతం పడిపోవడంతో అరటి టన్నుకు రూ 5 వేలకు కూడా కొనడం లేదని తెలిపారు. రైతులకు ఎకరాకు లక్షా రూపాయలు నష్టం వస్తున్న కారణంగా ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు సబ్సిడీతో నిర్మించుకున్న గోకులం బిల్లులను ప్రభుత్వం చెల్లించాలని కోరారు. 10 శాతం రైతులు, 90 శాతం ప్రభుత్వం భరించేలా గోకులం, మినీ గోకులం షెడ్లును రైతులు నిర్మించుకున్నారన్నారు. 30 శాతం రైతులు, 70 శాతం ప్రభుత్వం వాటాను భరించేలా గొర్రెల షెడ్లను కూడా నిర్మించుకున్నారని తెలిపారు. రైతులు అధిక వడ్డీకి అప్పుతెచ్చి గోకులం షెడ్లును, గొర్రెల షెడ్లు నిర్మించుకున్నారని తెలిపారు. 4నెలల నుంచి ప్రభుత్వం రాయితీ సొమ్ములు విడుదల చేయకపోవడంతో షెడ్లును నిర్మించుకున్న రైతులు పూర్తిగా నష్టపోతున్నట్లు చెప్పారు. గోకులం షెడ్లకు ప్రభుత్వం రూ.150 కోట్ల బకాయిలు ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయి రూ.150 కోట్లు విడుదల చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో కెకెఆర్ విజయం



మొదటి బహుమతి అందుకున్న కెకెఆర్ టీంతో భూపేష్‌రెడ్డి

పజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని వై.కోడూరు గ్రామంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల ఫైనల్లో ఆదివారం తాడిపత్రికి చెందిన కెకెఆర్ వారియర్స్ జట్టు విజయం సాధించింది. కొన్ని రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో 56 జట్లు పాల్గొన్నాయి. శిరిగిరెడ్డి సునందగారి జ్ఞాపకార్థం ఆమె భర్త కోడూరు మాజీ సర్పంచ్ శివారెడ్డి ఈ క్రికెట్ పోటీలను నిర్వహించారు. శివారెడ్డి వితరణ చేసిన మొదటి బహుమతి రూ.1,50,000, రెండో బహుమతి రూ.75 వేలును జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, ఎర్రగుంట్ల పట్టణ కూటమి అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. సెమీ ఫైనల్‌లో ఆర్‌టిసి స్పార్టెన్స్‌తో డిఎస్‌పి 11 తల పడగా, డిఎస్‌పి 11 గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. కెకెఆర్ వారియర్స్‌తో ఫ్రెండ్స్ 11 తలపడగా కెకెఆర్ గెలిచి ఫైనల్‌కు చేరుకుంది.

ఫైనల్‌కు చేరిన రెండు జట్లలో ఆదివారం డిఎస్‌పి 11 టాస్క్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. కెకెఆర్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసింది. కెకెఆర్ గెలు పొంది మొదటి బహుమతి గెల్చుకుంది. డిఎస్‌పి 11 రెండో బహుమతి గెలు చుకుంది. గంగాధర్ రెడ్డి జ్ఞాపకార్థం మోస్ట్ వ్యాల్యుబుల్ ప్లేయర్‌కు రూ.5,000, మోస్ట్ సిక్సర్స్‌కు రూ.3,000, మోస్ట్ ఫోర్‌కు రూ.2,000 అంద జేశారు. మోస్ట్ రన్నర్స్‌కు రూ.2,500తోపాటు స్మార్ట్ వాచీ బహు మతిగా జయశంకర్, సాయిరామిరెడ్డి ఇచ్చారు. మోస్ట్ వికెట్స్‌కు రూ.2,500, స్మార్ట్ వాచీ ఉపేంద్రరెడ్డి, సాయిరామిరెడ్డి ఇచ్చారు. బెస్ట్ ఫీల్డర్‌కు రూ.2,500 వివేక్, శరత్ ఇచ్చారు. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కె.అంకమ్మగారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఇచ్చారు. క్రీడా మైదానాన్ని కీర్తిశేషులు గంగా చైతన్యకుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు ఇచ్చారు. సమీప గ్రామాలవారు పెద్దఎత్తున పోటీలను తిలకించారు.



అర్హత పత్రాలతో శిక్షణ పొందిన పిల్లలు

కరాటేతో ఆత్మరక్షణ, శారీరక దృఢత్వం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మ రక్షణతోపాటు శారీరక దృఢత్వం కలుగుతుందని మాస్టర్ గంగాధర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డులో ఉన్న శ్రీస్వామి వివేకానంద పాఠశాల ఆవరణలో యువ, మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు కలర్ బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను దృష్టిలో పెట్టుకొని అమ్మాయిలకు ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. కర్రసాము, నాంచాకు, సెల్ఫ్ డిఫెన్స్ తదితర వాటిపై వేసవి శిక్షణా శిబిరం కూడా ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం నుంచి జూన్ 6వరకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి శివశంకర్ రెడ్డి తెలిపారు. విద్యార్థులకు వేసవిలో డ్రాయింగ్, పెయింటింగ్, ఆంగ్ల భాష, గణితం, కథలు తదితర అంశాలలో శిక్షణ ఇస్తామని తెలిపారు .విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు వివిధ రంగాలలో ప్రావీణ్యం కలిగిన ట్రైనర్లు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన కోరారు.

సోమిరెడ్డిపల్లె వాసి కువైట్‌లో మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

సోమిరెడ్డిపల్లె గ్రామవాసి పోరెడ్డి వెంకట సుబ్బారెడ్డి (36) ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు రెండు నెలలుగా ఆరోగ్యం సరిగాలేదు. కువైట్‌లోని సభా ఆస్పత్రిలో మృతి చెందాడు. ఆదివారం స్వగ్రామంలో సుబ్బారెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలున్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబంలో, గ్రామంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. వెంకటసుబ్బారెడ్డి మృతితో సోమిరెడ్డిపల్లి గ్రామంలో ఉపాధి కోసం కువైట్ వెళ్లి చనిపోయిన వారి సంఖ్య నాలుగుకు చేరింది.



మృతుడు పోరెడ్డి వెంకట సుబ్బారెడ్డి

నీటి సంపులో పడి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - వేముల

మండలంలోని వేల్పుల-భూమయ్యగారిపల్లి వెళ్లే దారిలో రైతు ఆదినారాయణరెడ్డి పొలంలో ఆదివారం విందుకు వచ్చిన అల్లిపిరా(40)అనే వ్యక్తి నీటి సంపులో పడి చనిపోయాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. అలిపీర వేల్పుల గ్రామానికి చెందిన వ్యక్తి. అతని స్నేహితులు మధ్యాహ్నం రైతు ఆదినారాయణ రెడ్డి పొలంలో ఏర్పాటు చేసిన సంపులో ఈత కోసం దిగి పడి చనిపోయినట్లు తెలిపారు. దీనిపై పోలీసులను అడగ్గా తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

'లోకసంస్థ'ను బలోపేతం చేయాలి

ఎల్‌హెచ్‌ఆర్‌పిసిఐఎల్ ఫౌండర్ జి.పి నరసింహులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

లోకసంస్థ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబర్టీ (ఎల్‌హెచ్‌ఆర్‌పిసిఐఎల్)ని బలోపేతం చేయాలని ఫౌండర్, జాతీయ చైర్మన్ జిపి నరసింహులు కోరారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన భవిష్యత్ కార్యాచరణ నిమిత్తం సంస్థ ముఖ్యమైన అంశాల గురించి చర్చించారు. సంస్థ విధి విధానాల గురించి వివరించారు. అనంతరం రాయలసీమ జిల్లాల విభాగ జనరల్ సెక్రటరీ జె.శ్రీనివాసులు సంస్థలో ఎవరి వంతు వారు విరివిగా సభ్యులను చేర్పించాలన్నారు. త్వరలో మంచి కమిటీ వేస్తామని, అందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తూ ప్రజలకు వారి ప్రాథమిక హక్కుల పట్ల అవగాహన కల్పించే ప్రయత్నం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాయలసీమ విభాగ సభ్యులు సిజె కొండయ్య, చౌడేశ్వరరావు, కడప జిల్లా విభాగ సభ్యులు ఉదయ భాస్కర్, అన్వర్ ఆలీ, రెహ్మాన్, చాంద్‌బాషా, వెంకటేశ్వర్లు, జమ్మలమడుగు పట్టణ విభాగ సభ్యులు సుధాకర్, నరసింహులు, ఉపేంద్ర, మైలవరం మండల విభాగ సభ్యులు పి.పాములేటి, రవీంద్ర, రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ నరసింహులు



డైరెక్టరీని ఆవిష్కరిస్తున్న సభ్యులు

'మానవత' ద్వారా పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మానవత సేవా సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆ సంస్థ మండల చైర్మన్ రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక గౌతమ్ స్కూల్‌లో ఆదివారం సభ్యులు మానవత డైరెక్టరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఉచిత కంటి వైద్య శిబిరం, కడప-ముద్దనూరు రోడ్డు డివైడర్‌లో మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పహాల్గావ్ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. మల్లెల జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల అధ్యక్షులు రామాంజనేయులురెడ్డి, కార్యదర్శి గంగయ్య, సభ్యులు మల్లికార్జునరెడ్డి, రమణారెడ్డి, రాఘవరెడ్డి, కత్తి ప్రతాపరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ స్టేట్ గ్రీవెన్స్‌సెల్ సెక్రెటరీ దండే రవిప్రకాష్ అన్నారు. వైసిపి అధిష్టానం తనపై నమ్మకం ఉంచి స్టేట్ గ్రీవెన్స్‌సెల్ సెక్రెటరీగా నియమించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కృషిచేసి తనకు ఈ పదవి ఇప్పించారన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన సుధీర్‌రెడ్డిని సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రవిప్రకాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు జయరామకృష్ణారెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

రేపు బస్టాండ్, జంతు వధశాలకు వేలం

ప్రజాశక్తి - ముద్దనూరు

2025-26 ఆర్థిక సంవత్సరానికిగానూ బస్టాండ్, జంతు వధశాలకు సంబంధించి రేపు సాయంత్రం మంగళవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆదివారం కార్యదర్శి లక్ష్మి నరసింహులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్టాండ్ వాహనాలకు రుసుం వసూలు చేసుకునేందుకు రూ.4లక్షలు డిపాజిట్ చెల్లించాలన్నారు. జంతు వధశాల రుసుం వసూళ్లకు రూ.40వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు. వేలం దక్కించుకున్న వారు మే నుండి 2026 మార్చి వరకు రుసుం వసూలు చేసుకునేందుకు హక్కు ఉంటుందని కార్యదర్శి తెలిపారు.

మేడేను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి కార్మికుడు మే డేను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక భవన నిర్మాణ కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను బానిసలు చేసే చట్టాలను చేస్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. మే డే కార్యక్రమంలో కార్మికులందరూ భాగస్వాములై తమ ఐక్యతను పాలక పక్షాలకు తెలిసేలా కదలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు చల్లా బాలాజీ, ఎస్ దస్తగిరి, బుజ్జి, బాబు, పెయింటర్ బాబు, కిట్టయ్య, ఆదినారాయణ బాబా, మాధవరెడ్డి, రవి, రామయ్య పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం

ప్రజాశక్తి - పెద్దముడియం

మండలంలోని దిగువ కలవటాల, కొండ పాపాయిపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న సేల్ సోలార్ కంపెనీ స్థానిక రైతుల గుండె కోతకు తెర లేపిందని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా భూముల సాగులో ఉన్న రైతుల నుంచి సోలార్ కంపెనీ భూములను లాక్కొని రైతులకు ఎలాంటి నష్ట పరిహారం కల్పించకుండా దౌర్జన్యాలకు పాల్పడుతోందని దిగువ కలవటాల గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సేల్ సోలార్ కంపెనీ యాజమాన్యంపై ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సేల్ సోలార్ కంపెనీ భూ ఆక్రమణలను అడ్డుకున్న స్థానిక రైతు మధుసూదన్‌రెడ్డిని అన్యాయంగా అక్రమ కేసుల్లో నిర్బంధించి జైలుకు పంపారని ఆరోపించారు. అన్యాయంగా రైతులపై కేసులు మోపితే వారు ప్రశ్నించేందుకు భయపడి ముందుకురారని బెదిరింపుల ధోరణిలో కూటమి ప్రభుత్వం కొనసాగుతోందని ఆయన విమర్శించారు. ఇది ఇలాగే కొనసాగితే అన్యాయానికి పాల్పడుతున్న రెవెన్యూ అధికారులపై రైతుల తరఫున కేసులు వేయాల్సి వస్తుందన్నారు. రైతులతో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తెలిపారు.



కంపెనీ అన్యాయాలపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పిఆర్